# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 05-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ న్యూ ఢిల్లీలో సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు.
- ❖ "రైసినా డైలాగ్" 11వ ఎడిషన్‌ను ఉద్దేశించి ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ కీలక ప్రసంగం చేశారు.
- ❖ రాజ్యసభ ఎన్నికలకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈరోజు నామినేషన్ దాఖలు చేశారు.
- ❖ కేంద్ర హోం మంత్రి అమిత్ షా జనగణన-2027 కోసం డిజిటల్ సాధనాలను ప్రారంభించారు.
- ❖ ఇంగ్లాండ్‌తో జరుగుతున్న సెమీఫైనల్ క్రికెట్ మ్యాచ్‌లో భారత్ భారీ స్కోర్ దిశగా పయనిస్తోంది.

========================

భారత్, యూరప్ దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం ప్రపంచ స్థిరత్వం, అభివృద్ధి, ఉమ్మడి శ్రేయస్సును బలోపేతం చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రధానమంత్రితో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ న్యూ ఢిల్లీలో ఈరోజు సమావేశమై ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య పలు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. అనంతరం సంయుక్త పాత్రికేయుల సమావేశంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ... నేడు ప్రపంచం అస్థిరత, అనిశ్చితి దిశగా వెళుతోందన్నారు. ఉక్రెయిన్ నుండి పశ్చిమాసియా వరకు, ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రాంతాలు నిరంతర సంఘర్షణలను చూస్తున్నాయని ఇటువంటి తరుణంలో భారత్, యూరప్ రెండు ప్రధాన దౌత్య శక్తులుగా స్వర్ణ యుగంలోకి ప్రవేశిస్తున్నాయని చెప్పారు. సైనిక ఘర్షణ ఏ సమస్యను పరిష్కరించలేదనే విషయంలో భారతదేశం, ఫిన్లాండ్ ఏకగ్రీవంగా ఉన్నాయని పేర్కొన్నారు. శాంతిని నెలకొల్పే ప్రతి ప్రయత్నానికి రెండు దేశాలు మద్దతు ఇస్తూనే ఉంటాయని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ ఏడాది ప్రారంభంలో భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేశాయని తెలిపారు. ఈ ఒప్పందం

భారతదేశం, ఫిన్లాండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడి, సాంకేతిక సహకారాన్ని మరింత బలోపేతం చేస్తుందని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రైసినా డైలాగ్ 11వ ఎడిషన్‌ను ఈ రోజు న్యూఢిల్లీలో ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ కీలక ప్రసంగం చేశారు. గ్లోబల్ సౌత్ భవిష్యత్ ప్రపంచ క్రమాన్ని మారుస్తుందని అందులో భారత్ కీలకంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఐక్య రాజ్యసమితి నిర్మాణాత్మక వ్యవస్థాపక సభ్యదేశమైన భారత్ ప్రపంచ శాంతి పరిరక్షణకు నిరంతర ప్రయత్నాలు చేస్తోందని కొనియాడారు.

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

జనగణన-2027 కోసం డిజిటల్ సాధనాలను కేంద్ర హోం మంత్రి అమిత్ షా న్యూఢిల్లీలో ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. వీటితో పాటుగా ప్రగతి, వికాస్ జనాభా లెక్కల మస్కట్లను కూడా ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా జనగణన కార్యకలాపాలను సులభతరం చేసేందుకు ఈ అధునాతన డిజిటల్ సాధనాలను సెంటర్ ఫర్ డెవలప్మెంట్ ఆఫ్ అడ్వాన్స్డ్ కంప్యూటింగ్ (సీ-డాక్) రూపొందించింది. 2025 జూన్ 16వ తేదీన జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా జనగణన-2027ను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సారి జనగణన- రెండు విడతల్లో జరుగనుంది. తొలిసారి జనాభాను డిజిటల్ విధానంలో గణిస్తున్నారు. అలాగే మొట్ట మొదటిసారిగా సెల్ఫ్-ఎన్యూమరేషన్ అవకాశం అందుబాటులోకి తీసుకువచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈరోజు రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో నితీష్ కుమార్ వెంట కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తదితరులు ఉన్నారు. కాగా ముఖ్యమంత్రి పదవి నుంచి తాను వైదొలుగుతున్నట్లు నితీష్ కుమార్ ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలియజేశారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావాలని తాను కోరుకుంటున్నానని, రెండు దశాబ్దాలకు పైగా బీహార్ ముఖ్యమంత్రిగా తనపై నమ్మకం ఉంచినందుకు ఆ రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు చూపిన విశ్వాసం కారణంగా బీహార్ ఈరోజు అభివృద్ధికి కొత్త దిశను చూపుతోందన్నారు. బీహార్ ప్రజలతో తన సంబంధం కొనసాగుతుందని, కొత్త ప్రభుత్వానికి పూర్తి మద్దతు, మార్గదర్శకత్వం అందిస్తానని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించడానికి ఇరు దేశాలు కలిసి పనిచేయడానికి నిర్ణయించామని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధానమంత్రి తెలిపారు. ఇక ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతిపై భారత్ సంతాపం తెలిపింది. ప్రభుత్వం తరపున ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈరోజు సంతాప పుస్తకంలో సంతకం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నూతన సాంకేతికతలు, కృత్రిమ మేధస్సు రాకతో ఆరోగ్య సంరక్షణ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 26 మంది యువ వైద్య నిపుణులకు ఆయన ఢిల్లీలో ఈరోజు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... దేశంలో ఆరోగ్య సంరక్షణ సేవల భవిష్యత్‌ను బలోపేతం చేయడంలో యువ వైద్యులు ముఖ్య పాత్ర పోషిస్తారని అన్నారు. ప్రతిభను గుర్తించడం వల్ల ఆత్మవిశ్వాసం పెరుగడమే కాకుండా.. యువ వైద్య నిపుణులు మరింత నిబద్ధతతో సమాజానికి తమ వంతు కృషి చేయడానికి స్ఫూర్తినిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా యువత నుండి “మై భారత్ బడ్జెట్ క్వెస్ట్-2026”కు విశేషమైన స్పందన లభించిందని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ కార్యక్రమం రెండవ విడతలో దాదాపు 47 వేల వ్యాసాలు సమర్పించినట్లు వెల్లడించింది. 2047 వికసిత్ భారత్ దార్శనికతకు యువ పౌరులు కేంద్ర బడ్జెట్‌తో నిమగ్నమయ్యేలా ఆలోచనలను అందించేందుకు వారిని ప్రోత్సహించడం ఈ పోటీ లక్ష్యం. విజేతలకు ఈ నెల 15 నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తమ బడ్జెట్ ఆలోచనలను సమర్పించే అవకాశం లభిస్తుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. మొదటి విడతలో.. దేశవ్యాప్తంగా జరిగిన ఆన్‌లైన్ క్విజ్‌లో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 12 లక్షలకు పైగా యువత పాల్గొన్నారు, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు అత్యధిక భాగస్వామ్యాన్ని నమోదు చేశాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ క్రికెట్ కప్‌లో భాగంగా ముంబైలోని వాంఖెడే స్టేడియంలో రెండవ సెమీఫైనల్ మ్యాచ్ భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన భారత్.. ఓపెనర్ సంజు శాంసన్ 89 పరుగులు చేసి రాణించడంతో 18 ఓవర్లు పూర్తయ్యే సరికి 5 వికెట్ల నష్టపోయి 215 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 79 వేల 116 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై.. చివరకు 899 పాయింట్ల లాభంతో 80 వేల 015 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 285 పాయింట్ల లాభంతో 24 వేల 765 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 91 రూపాయల 60 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 82 డాలర్లు వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5 వేల 150 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యవసాయం, గ్రామీణ పరివర్తన అనే అంశంపై రేపు ఉదయం దృశ్య మాధ్యమం ద్వారా బడ్జెట్ అనంతర వెబినార్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తారు. వ్యవసాయం, పశుసంవర్ధకం, పాడి పరిశ్రమ, మత్స్య సంపద, గ్రామీణ జీవనోపాధి ఇతివృత్తంతో నాలుగు ప్రధాన రంగాలపై 8 వేర్వేరు వెబినార్ సెషన్‌లు జరుగుతున్నాయి. జీడిపప్పు, కొబ్బరి, గంధం, అగర్వుడ్, బాదం, వాల్‌నట్‌లు, పైన్ గింజలు వంటి అధిక విలువ కలిగిన వ్యవసాయాన్ని ప్రోత్సహించడంపై బడ్జెట్ అనంతర వెబినార్ దృష్టి సారించనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల కోసం భారతదేశం నిర్వహిస్తున్న బ్యాంకింగ్ కార్యక్రమం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని ఐక్యరాజ్యసమితి ప్రశంసించింది. ఈ కార్యక్రమం ద్వారా 290 మిలియన్లకు పైగా మహిళలకు బ్యాంకింగ్ సేవలను

అందించిందని ఐక్యరాజ్యసమితి (UN) మహిళల పాలసీ డైరెక్టర్ సాండ్రా హెండ్రిక్స్ వెల్లడించారు. ఇది మహిళలు, బాలికల పరివర్తనకు ఒక మార్గంగా ఆమె అభివర్ణించారు. ముఖ్యంగా మహిళలు, బాలికల జనాభాకు డిజిటల్ గుర్తింపును ప్రారంభించడంలో భారత ప్రభుత్వం చూపిన చొరవ ఒక గొప్ప ఉదాహరణ అని ఆమె పేర్కొన్నారు.

========================
========================